ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
ఆదివారం | 11 అక్టోబరు, 2026 | పేజీలు : 08

## చింతలతండాలో విద్యుత్ సమస్యకు పరిష్కారం

ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/వేలేరు:** వేలేరు మండలంలోని చింతలతండ గ్రామంలో రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ ఓవర్‌లోడ్ సమస్య పరిష్కారమైంది. గ్రామంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై అధిక భారం కారణంగా వ్యవసాయ మోటార్లు కాలిపోతుండటంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్న విషయంపై ప్రజాపక్షం దినపత్రికలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు,ఎస్ఈ సౌమ్య నాయక్, డీఈ మల్లికార్జున్, ఏడీఈ రాజేశ్వరరావు, ఏఈ కుమారస్వామి తదితరులు విద్యుత్ సమస్యాత్మక ప్రాంతాన్ని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు గ్రామ సర్పంచ్ మాలోతు రాజు, లాయర్ అంగోతు సాంబయ్య తెలిపారు. విద్యుత్ సమస్య పరిష్కారం కావడంతో గ్రామ రైతులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్న విద్యుత్ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మాలోతు భాస్కర్, న్యాయవాది అంగోతు సాంబయ్య, మాలోతు పూజారి, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్తులో సిద్దిపేట నుండి ఉత్తర భారతానికి రైలు

### మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు

**ప్రజాపక్షం/సిద్దిపేట:** రాబోయే రోజుల్లో సిద్దిపేట మీదుగా ఉత్తర భారతానికి రైళ్లు నడవనున్నాయని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. జిల్లా పదేళ్ల పండుగ సందర్భంగా వర్తక,వాణిజ్య,వ్యాపార,వైశ్య సంఘాల ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని రైస్ మిల్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సిద్దిపేటకు రైలు ఎవరు తేలేదని బిఆర్ఎస్ సర్కార్ రైల్వే శాఖ పెట్టిన నిబంధనలను ఒప్పుకోవడం తోనే సిద్దిపేటకు రైలు వచ్చిందన్నారు. హైదరాబాద్ నుండి సిరిసిల్ల వరకు రైల్వే ట్రాక్ కోసం భూములను రాష్ట్ర ప్రభుత్వమే 800 కోట్లతో కొనుగోలు చేసిందన్నారు. అలాగే మొత్తం ఖర్చులు మూడో వంతు ఖర్చు రాష్ట్ర ప్రభుత్వమే కట్టాలని, రైలు ప్రారంభం తర్వాత మొదటి ఐదు సంవత్సరాలు రైల్వే శాఖకు ఎలాంటి నష్టం జరిగిన అది రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని ఒప్పందం కుదుర్చుకోవడం జరిగిందన్నారు. ఇలా చాలా నియమ నిబంధనలను ఒప్పుకోవడంతోనే సిద్దిపేటలో రైలు కూత వినబడిందన్నారు. రాబోయే రోజుల్లో హైదరాబాద్ నుండి సిద్దిపేట మీదుగా దక్షిణ భారతానికి ప్రతి అర్థగంటకు ఒక రైలు నడవనుందన్నారు. దీనికి సంబంధించిన విద్యుత్ లైన్ పనులకు సంబంధించిన టెండర్లు పూర్తి అయ్యాయని పనులు కూడా త్వరగా పూర్తి అవుతాయన్నారు. సిద్దిపేటలో రైలు, గోదావరి జలాలు, రోడ్లు, విద్యుత్ సౌకర్యాలు ఉండడంతోనే ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రస్తుతం సిద్దిపేటకు మల్లన్న సాగర్ ద్వారా మంచినీళ్లు వస్తున్నాయన్నారు. కరెంటు లేకుండా మల్లన్న సాగర్ వద్ద వాల్తింపితే సిద్దిపేటలోని ప్రతి ఇంటికి నీళ్లు వచ్చి చేరుతాయన్నారు.వచ్చే వందేళ్ల వరకు సిద్దిపేటలో మంచినీళ్ల గోస ఉండొద్దన్న ముందుచూపుతో కావలసిన సదుపాయాన్ని ఏర్పాటు చేశానన్నారు. తాను మార్కెటింగ్ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు రైస్, పత్తి మిల్లుల వ్యాపారవేత్తలకు ఇబ్బందులు కలవకుండా అన్ని విధాలుగా అండగా నిలిచానన్నారు. బిఆర్ఎస్ పదేండ్ల కాలంలో రైస్ మిల్లులపై అధికారుల దాడులు కనబడకుండా పోయాయన్నారు. సిద్దిపేటలో సంది, పంది, చెత్తకుండీ లేకుండా తయారు చేసుకున్నామన్నారు. కెసిఆర్ ఆశీస్సులు ప్రజల దీవెనలతో తాను ఈ స్థాయిలో ఉండి ప్రజలకు సేవ చేస్తున్నారన్నారు. చరిత్ర కాలం ఉన్నంతవరకు తాను సిద్దిపేటలో చేసిన అభివృద్ధి పనులు నిలబడి ఉంటాయన్నారు. దేశంలో ఎక్కడికి వెళ్లినా సిద్దిపేట వాళ్లమంటే గౌరవం దక్కేలా అభివృద్ధి చేశానన్నారు, ఆనంతరం వర్తక వ్యాపారులు మాజీ మంత్రి హరీష్‌రావును సన్మానించారు.




**కోమటిచెరువు వద్ద లేజర్ షో :** బతుకమ్మ పండుగ సందర్భంగా సిద్దిపేట కోమటిచెరువు వద్ద నిర్వహించిన లేజర్ షో ఆకట్టుకుంది. బతుకమ్మ పర్వదినం పురస్కరించుకొని కోమటిచెరువుకు వచ్చిన మహిళలు లేజర్ షోను ఆనందంగా తిలకించారు.

### మూఢనమ్మంతో కన్నతల్లికి
# నిప్పు పెట్టిన కొడుకు

మెదక్ జిల్లా మండలం ఎల్లుపేటలో దారుణం

బాణామతి అనుమానంతో తల్లిని సజీవ దహనం చేసిన తనయుడు

నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



**ప్రజాపక్షం /టేక్మాల్ :** కని పెంచిన కన్నతల్లిపైనే కర్కశత్వం చూపించాడు. తనకు జన్మనిచ్చిన తల్లినే అనుమానంతో అగ్నికి ఆహుతి చేశాడు. మూఢనమ్మకం మదిలో విషంగా మారడంతో విచక్షణ కోల్పోయిన ఓ కుమారుడు, కన్నతల్లిని దారుణంగా హత్య చేసిన ఘటన మెదక్ జిల్లా మండలం ఎల్లుపేట గ్రామంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. గ్రామానికి చెందిన కర్రే సాయమ్మ (40) తన కుమారుడు కర్రే దుర్గేష్ (22)తో కలిసి నివసిస్తోంది. ఆటో నడుపుతూ జీవనం సాగించే దుర్గేష్, గత వారం రోజులుగా తన తల్లి బాణామతి చేస్తోందనే అనుమానంతో ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో శనివారం సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో ఇంటికి వచ్చిన దుర్గేష్ తల్లితో వాగ్వాదానికి దిగాడు. మాటామాటా పెరగడంతో ఆగ్రహానికి గురైన అతడు, తల్లిపై డీజిల్ పోసి నిప్పంటించినట్లు తెలిసింది. మంటల్లో చిక్కుకున్న సాయమ్మ తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయింది.

**అనుమానమే ఆయుధమై.. తల్లి ప్రాణం తీసిన తనయుడు!:** కన్నతల్లి బాణామతి చేస్తోందనే అనుమానంతో ఆమెను హత్య చేసినట్లు ఆరోపణలు రావడం గ్రామంలో తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. నిజానిజాలు తెలుసుకోకుండా మూఢనమ్మకాలను నమ్మితే ఎలాంటి విషాదాలు చోటుచేసుకుంటాయో ఈ ఘటన మరోసారి చాటిచెప్పింది. కుటుంబంలో తలెత్తిన అనుమానం చివరకు ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకుంది.

**ఘటనా స్థలానికి పోలీసులు..అదుపులో నిందితుడు:** స్థానికుల సమాచారంతో అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, టేకుకారెడ్డి ఎస్ఐ అరవింద్ కుమార్ వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. నిందితుడు దుర్గేష్‌ను అదుపులోకి తీసుకుని ఘటనకు దారితీసిన పరిస్థితులపై విచారణ చేపట్టారు.

### రామప్ప వారసత్వానికి ముప్పుగా
# ఓపెన్‌కాస్ట్...ప్రాజెక్టు నిలిపివేయాలి

**ప్రజాపక్షం/ములుగు:** ప్రపంచ వారసత్వ గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం, రామప్ప చెరువుకు ముప్పు వాటిల్లే అవకాశం ఉన్న సింగరేణి ప్రతిపాదిత ఓపెన్‌కాస్ట్ బొగ్గు తవ్వకాల ప్రాజెక్టును నిలిపివేయాలని మానవ హక్కుల వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ప్రాజెక్టు వలన పర్యావరణానికి, ప్రజల జీవనోపాధికి కలిగే నష్టాలపై అవగాహన కల్పించేందుకు శనివారం జంగాలపల్లి క్రాస్ నుండి రామప్ప దేవాలయం వరకు చైతన్య ర్యాలీ నిర్వహించింది. బొగ్గు తవ్వకాలతో వెలువడే దుమ్ము, దూళి వలన వాయు కాలుష్యం పెరగడంతో పాటు వ్యవసాయ దిగుబడులు తగ్గి రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని వేదిక ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. తవ్వకాల సమయంలో జరిగే పేలుళ్లు, భూకంపనాల ప్రభావంతో రామప్ప దేవాలయం, మూడు టిఎంసిల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన రామప్ప చెరువు భద్రతపై ఆందోళన ఉన్నాయని పేర్కొన్నారు. సుమారు 25 గ్రామాల ప్రజల భవిష్యత్తుపై ప్రభావం చూపే ప్రాజెక్టుకు సంబంధించి ప్రజలకు పూర్తి సమాచారం అందించాలని, పర్యావరణ ప్రభావాలపై సమగ్ర అధ్యయనం చేసిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాడిచర్ల ప్రాంతంలో ఓపెన్‌కాస్ట్ తవ్వకాలతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. రామప్ప వారసత్వ సంపద, ప్రకృతి వనరులు, ప్రజల జీవనోపాధిని పరిరక్షించేందుకు ప్రాజెక్టును ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ర్యాలీలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాధావత్ రాజు, రాష్ట్ర కార్యదర్శి టి హరికృష్ణ, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు అద్దునూరి యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి వి దిలీప్, తదితరులు పాల్గొన్నారు.



## విధుల్లో ఉన్న పోలీస్ కానిస్టేబుల్‌పై దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు

ప్రజాపక్షం/చిట్యాల: విధులు నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్‌పై దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు చిట్యాల సబ్ ఇన్స్పెక్టర్(ఎస్ఐ) పోచం పల్లి సతీష్ తెలిపారు. వివరాల్లోకి వెలితే చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో బ్లూకోల్ట్స్ విధుల్లో ఉన్న కానిస్టేబుల్ మారబోయిన మహేష్ శుక్రవారం అర్థరాత్రి సమయంలో డ్యూటీలో ఉండగా, చిట్యాల సెంటర్‌లో ఘర్షణ జరుగుతోందని 112 కాల్ ద్వారా సమాచారం అందింది. సమాచారం అందుకున్న కానిస్టేబుల్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ఘర్షణను ఆపడానికి ప్రయత్నించారు. ఆ సమయంలో తుమ్మల గణేష్, చిలువేరి దేవ, మాదాసు సాయినాథ్ అనే వ్యక్తులు కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగిస్తూ ఆయనపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో గాయపడిన కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు నిందితులపై చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ తెలిపారు.ఇక ముందు ఎవరైనా ఇటువంటి చర్యలకు పాల్పడితే వారిపై కఠినమైన చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు చిట్యాల విద్యార్థి ఎంపిక

ప్రజాపక్షం/చిట్యాల: జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బానోత్ శ్రీధర్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక య్యాడు. జిల్లా స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన శ్రీధర్ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అండర్..14 ట్రయథ్లాన్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొననున్నట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సూదం సాంబమూర్తి తెలిపారు. విద్యార్థి ఎంపిక పట్ల మండల విద్యాధికారి కొడపాక రఘుపతి అభినందనలు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీరామ్ రఘుపతి ఆకాంక్షించారు. శ్రీధర్‌ను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.



## తల్లిదండ్రుల జ్ఞాపకార్థం మహా అన్నదానం

ప్రజాపక్షం / జనగామ : జనగామ పట్టణానికి చెందిన కొత్తూరి శ్రీధర్ తమ తల్లి దండ్రులైన కొత్తూరు శకుంతల, సత్యనారాయణల జ్ఞాపకార్థం శనివారం జనగామ ఎంసిహెచ్ హాస్పటల్‌లో మహా అన్నదాన కార్యక్రమం నిర్వయించారు. అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరగగా హాస్పటల్‌కు వచ్చిన వారందరికి భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా అమ్మ ఫౌండేషన వ్యవస్థాపకులు మంతెన మణికుమార్ మాట్లాడుతూ ఆకలితో ఎవరు బాధపడొద్దనే ఉద్దేశ్యంతోనే అమ్మ ఫౌండేషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పుట్టిన రోజు, పెళ్లిరోజు, జ్ఞాపకార్థం సందర్భంగా పలువురు ముందుకు వచ్చి అన్నదానం చేయడం జరుగుతుందన్నారు. శనివారం కొత్తూరు శ్రీధర్ వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అన్నదానం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ కార్యదర్శి వంగ భీమరాజ్, కొత్తూరు శ్రీధర్ కుటుంబ సభ్యులు, వ్యాపారులు తెలి అశోక్, సంపత్‌గౌడ్, అమ్మ ఫౌండేషన్ నాయకులు కొయ్యడ రవి, సిద్దిరాల చందు,పిట్టల కృష్ణ, బింగి నరసింహులు, కొయ్యడ విశ్వ, బొల్లం కనకరాజు, ఎండి ఆఫ్రోజు పాల్గొన్నారు.



## తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ

ప్రజాపక్షం/భూపాలపల్లి : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవానికి, ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను జిల్లా ప్రజలందరూ ఆనందోత్సాహాలతో, భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకాంక్షించారు. ఎంగిలి పూల బతుకమ్మతో ప్రారంభమయ్యే తొమ్మిది రోజుల బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం జిల్లా ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రకృతిలో సహజంగా లభించే వివిధ రకాల రంగురంగుల పూలను సేకరించి, అందంగా బతుకమ్మలను పేర్చి చిన్నా,పెద్ద తేడాలేకుండా మహిళలు ఆటపాటలతో జరుపుకునే ఈ పండుగ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. బతుకమ్మ కేవలం పూల పండుగ మాత్రమే కాదని, మహిళల ఆత్మగౌరవం, ఐక్యత, కుటుంబ అనుబంధాలు, ప్రకృతితో మానవాళికి ఉన్న విడదీయలేని అనుబంధాలకు నిదర్శనమని పేర్కొన్నారు. తొమ్మిది రోజుల పాటు జరిగే బతుకమ్మ వేడుకలు ప్రతి ఇంటా ఆనందాన్ని నింపాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ బతుకమ్మ పండుగను సురక్షితంగా, సంతోషంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. నిమజ్జన ప్రాంతాలలో మున్సిపల్, పంచాయతీ అధికారులు తగు ఏర్పాట్లు చేయాలని తెలిపారు.



## కెసిఆర్ దూరదృష్టితోనే భూపాలపల్లి జిల్లా ఏర్పాటు

### మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి



ప్రజాపక్షం/భూపాలపల్లి : జయశంకర్ భూపాలపల్లి జిల్లాను ఏర్పాటు చేయడంలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దూరదృష్టి, ప్రత్యేక చొరవతో నే జిల్లాల ఏర్పాటు జరిగిందని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి అన్నారు. భూపాలపల్లి జిల్లా ఆవిర్భవించి పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు రోజుల దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం భూపాలపల్లిలోని హనుమాన్ ఆలయం నుంచి మెడికల్ కళాశాల మీదుగా సమీకృత జిల్లా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట తెలంగాణ బాపు కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అంతకుముందు హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అంబేద్కర్, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. రాష్ట్రంలో కేసీఆర్ వేసిన అభివృద్ధి ముద్రను చెరిపివేయడం సాధ్యం కాదని అన్నారు. జిల్లా ఏర్పాటు అనేది అప్పటికప్పుడు తీసుకున్న నిర్ణయం కాదని, ఈ ప్రాంత అభివృద్ధిపై ముందుచూపుతో తీసుకున్న నిర్ణయమని పేర్కొన్నారు. 2016 అక్టోబర్ 11న కొత్త జిల్లాల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేయడంతో మారుమూల ప్రాంతాల అభివృద్ధికి మార్గం సుగమమైందన్నారు. గతంలో తెలంగాణలో పది జిల్లాలు ఉండగా, కేసీఆర్ ప్రభుత్వం వాటిని 33 జిల్లాలకు విస్తరించి పాలనను ప్రజలకు చేరువ చేసిందని మధుసూదన్‌రావు, స్థానిక కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్

ప్రజాపక్షం/తరిగొప్పుల: మహిళా సంఘాల ద్వారా నిర్వహించే వరిధాన్యం కొనుగోలు కేంద్రం (ఐకేపీ) వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అబ్దుల్ నాగారం గ్రామంలోని రైతు వేదికలో సర్పంచ్ కావటి సుధాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారుల చేతిలో మోసపోకుండా పండించినటువంటి పంటను ఆరబెట్టుకుని ప్రభుత్వం కొనుగోలు చేసే వరిధాన్యం కొనుగోలు కేంద్రానికి తరలించి సరైన మద్దతు ధర పొందాలన్నారు. ఏ గ్రేడు రకం ధర రూ.2461 పూర్తి ధర పొందే విధంగా రైతులు తమ ధాన్యాన్ని తయారుచేసుకోవాలన్నారు. సన్నాలకు ప్రభుత్వం అందించేటటువంటి రూ.500 బోనస్ కూడా అందుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంపత్, ఏఈవో వినయ్‌కుమార్, వార్డు మెంబర్లు కనకరాజు, నాయకులు రాధ, లక్ష్మి, బాలయ్య, శ్రీవిద్య, శ్రీనివాస్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



## గ్రామాభివృద్ధికి సల్మాన్ కృషి మరువలేనిది

### మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు



ప్రజాపక్షం/మహదేవపూర్: గ్రామాభివృద్ధికి మాజీ ఉప సర్పంచ్ సల్మాన ఖాన్ చేసిన కృషి మరువలేనిదని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు.శనివారం మండలకేంద్రంలోని కళాశాల క్రీడా మైదానంలో మాజీ సర్పంచ్ సల్మాన్ ఖాన్ స్మారకార్థం ఏర్పాటుచేసిన క్రికెట్ టోర్నమెంటును ఘనంగా ప్రారంభించారు. క్రీడలు, చదువుకు ప్రోత్సాహం అవసరమని సల్మాన్ ఖాన్ స్మారకార్థం నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్ మంథని మహదేవపూర్ క్రీడాకారులకు ఎంతగానో ఉపయోగపడాలని ఆకాంక్షించారు.ఈ ప్రాంత యువతలో ఉన్న ప్రతిభలో గొప్పది ప్రోత్సాహం అందించాల్సిన అవసరముందని ఇటీవల ట్రోబాల లో పలిమెల మండలానికి చెందిన క్రీడాకారుడు బంగారు పథకం సాధించడమే ఉదుకు నిదర్శనమని అన్నారుసల్మాన్ ఖాన్ యవత పట్ల నిబద్ధతో,పెద్దల పట్ల గౌరవం కలిగిన వ్యక్తిగా ప్రజలతో కలిసిమెలిసి ఉండేవాడనిఆయన మరణం బిఆర్ఎస్ పార్టీకి తీరని లోటని సల్మాన్ ఖాన్ కుటుంబానికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

**సమాజంలో మంచి వ్యక్తిగా నాయకునిగా పేరు**

మాజీ సర్పంచ్ శ్రీపతి బాపు మాజీ ఉప సర్పంచ్ సల్మాన్ ఖాన్ సమాజంలో మంచి వ్యక్తిగా నాయకునిగా అనతి కాలంలో గుర్తింపు పొందారని మాజీ సర్పంచ్ శ్రీపతి బాపు అన్నారు.ఉప సర్పంచ్‌గా తనతో కలిసి గ్రామాభివృద్ధి కోసం పని చేసిన రజులను గుర్తు చేసుకున్నారు.యువతకు మెరుగైన క్రీడా వసతులు కల్పించాలన్న సల్మాన్ ఖాన్ ఆలోచనలకు ప్రభుత్వ కళాశాల మైదానాన్ని అభివృద్ధి చేస్తున్నామని అన్నారు.మైదానాన్ని 10 మీటరల మేరకు విస్తరించాల్సిన అవసరం ఉందని అటవీ శాఖ అనుమతులు లభిస్తేనే విస్తరణ జరుగుతుందని దీనికి పుట్ట మధు ఎమ్మెల్యేగా పరిశ్కారం జరుగుతుందని సల్మాన్ ఖాన్ చెప్పేవారని గుర్తు చేసారు.ఈ విషయంలో యువత ఆలోచించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెండ్యాల మనోహర్, మహిళా నాయకురాలు కేదారీ గీతా బాయి, ఆన్నారి ప్రకాష్, రేవెల్లి రాజశేఖర్, దుర్గం పోచం, అన్నమనేని అరుణ,చిలుక సునీత, స్వప్న, పేట లత, చంద్రకళ, ఓడేటి రవిందర్, ప్రభాకర్ వార్డు సభ్యురాలు లావణ్య, కార్యకర్తలు, క్రీడాకారులు, పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలకు పెద్ద ఎత్తున తరలిరావాలి

ప్రజాపక్షం/దేవరుప్పుల: బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు పార్టీ శ్రేణులు పెద ఎత్తున బైక్ ర్యాలీగా తరలిరావాలని బిఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి పిలుపునిచ్చారు. మండల అధ్యక్షులు తీగల దయాకర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ఏర్పడి పదేళ్లు పూర్తయిన సందర్భంగా కలెక్టరేట్ వద్ద కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసే వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల పార్టీ శ్రేణులు ఉదయం 10 గంటల్లోగా జనగామ చౌరస్తాకు చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేశం, సుందర్, రాంసింగ్ నాయక్, ప్రవీణ్, అర్జున్, రవి, శ్రీనివాస్, మహేష్, నరసింహులు, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.



## ఎగిసిపడేలా ఎంగిలిపూల బతుకమ్మ

ప్రజాపక్షం/ జనగామ : బతుకమ్మ సంబురాలు మొదలయ్యాయి. శనివారం ఎగిసిపడేలా ఎంగిలిపూల బతుకమ్మను ప్రారంభించారు. తొమ్మిది రోజుల పాటు తీరొక్క రూపంలో బతుకమ్మను పేర్చి ఆడపడుచులు ఆనందోత్సవంగా జరుపుకునే బతుకమ్మ సంబురాలు వాడవాడలా జరిగాయి. జనగామ పట్టణంలోని బతుకమ్మ కుంటలో అన్ని ఏర్పాట్లు చేయడంతో పెద్ద ఎత్తున ఆడపడుచులు పాల్గొని ఆటలాడారు. ప్రధాన కూడళ్ల వద్ద అలికి ముగ్గు వేసి తమ ఇంట పేర్చిన బతుకమ్మల్లో కూడళ్లకు వచ్చిన ఆడపడుచులు గౌరవంగా గౌరమ్మ పాటలు పాడారు. తెలంగాణలో ఆడపడుచులు అత్యంత ఆనందోత్సవంగా జరుపుకునే పండగ బతుకమ్మ పండగ కావడంతో శనివారం ఎంతో సంబురంగా జరుపుకున్నారు.బంతిపూల ధరలు సైతం పడిపోవడంతో విక్రయదారులు, రైతులు నష్టపోయిన పరిస్థితి. గతేడాది 200 రూపాయలకు కిలో బంతిపూల విక్రయించగా ఈ ఏడాది 60 నుండి 80 రూపాయలకే కిలో విక్రయించారు.



## జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే తొలగించాలి



ప్రజాపక్షం /జనగామ : ప్రభుత్వం చేతిలో కీలు బొమ్మగా మారిన చీఫ్ ఎలక్షన్ కమీషనర్ జ్ఞానేష్‌కుమార్‌ను వెంటనే తొలగించాలని యుఎస్‌పిసి జిల్లా కమిటి డిమాండ్ చేసింది. శనివారం జనగామలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్ఐఆర్ రద్దు చేయాలని, జ్ఞానేష్‌కుమార్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా యుఎస్‌పిసి బాధ్యులు శ్రీనివాసులు, చంద్రశేఖర్ రావు, నల్లనాగుల రాజు, షరీఫ్, శాడ రవి మాట్లాడుతూ స్వతంత్ర సంస్థగా పనిచేయాల్సిన కేంద్ర ఎన్నికల కమీషనర్ ప్రభుత్వానికి కీలుబొమ్మగా మారాడన్నారు. ప్రధాన ఎన్నికల అధికారి వెంటనే రాజీనామా చేయాలని, ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలని, తొలగించిన 13 కోట్ల ఓట్లపై సమగ్ర, స్వతంత్ర విచారణ చేపట్టాలని, ఎన్నికల కమీషనర్ల నియామక చట్టం 2023ను రద్దు చేయాలని, 2024 తరువాత జరిగిన ఎన్నికలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈవిఎంలకు బదులు బాలెట్ పేపర్లతో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటి నాయకులు మాదారు వెంకటేష్, అంకుషా వలీ, శ్రీనివాసాచారి, లక్ష్మయ్య, కృష్ణ, వజ్రయ్య, శ్రీనివాసులు, సయ్యద్ శ్రీనివాసులు,రాజేందర్, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

**జనగామ టౌన్‌లో**

ప్రజాపక్షం/జనగామ టౌన్: చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేసి సామాన్యుల ఓటు హక్కును కాపాడాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటి (యూఎస్‌పీసీ) జనగామ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. తొలగించిన ఓట్లపై స్వతంత్ర విచారణ చేపట్టాలని, ఎన్నికల కమిషనర్ల నియామక చట్టం 2023ను రద్దు చేయాలని, ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు వెంకటేష్, అంకుషావలి, శ్రీనివాసాచారి, శ్రీనివాసులు, సయ్యద్, శ్రీనివాసులు, రాఘేందర్, శోభన్, వీరారెడ్డి, అప్సర్, నర్సింహులు, గణేష్, లక్ష్మణ్ జీ, రాజిరెడ్డి,రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పెద్దాపూర్ బిఆర్ఎస్ కన్వీనర్‌గా సాంబయ్య

**ప్రజాపక్షం/ఆత్మకూరు :** పరకాల నియోజకవర్గం ఆత్మకూరు మండలం పెద్దాపూర్ గ్రామ బీఆర్ఎస్ పార్టీ కన్వీనర్‌గా మాజీ సొసైటీ చైర్మన్,సీనియర్ నాయకులు నాగనబోయిన సాంబయ్యను నియమిస్తున్నట్లు పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చల్ల ధర్మారెడ్డి మాట్లాడుతూ పార్టీపై నిబద్ధతతో పని చేస్తూ, గ్రామస్థాయిలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ నియామకం చేపట్టినట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ గ్రామంలో పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేయాలని సూచించారు. కన్వీనర్ గా ఎన్నికైన నాగనబోయిన సాంబయ్య మాట్లాడుతూ తనపై నమ్మకంతో గ్రామ కన్వీనర్‌గా బాధ్యతలు అప్పగించిన చల్లా ధర్మారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో పెద్దాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పెద్దాపూర్ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సమష్టిగా కృషి చేయాలి



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** ఉమ్మడి నల్లగొండవరంగల్‌ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సమిష్టిగా కృషి చేయాలని బీజేపీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి పిలుపునిచ్చారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషీధర్ రెడ్డి అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో పార్టీ విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అర్హులైన పట్టభద్రులందరినీ ఓటర్లుగా నమోదు చేయించి, గ్రామాలు, మండలాల వారీగా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పట్టభద్రులకు వివరించాలని అన్నారు. జిల్లా అధ్యక్షుడు నిషీధర్ రెడ్డి మాట్లాడుతూ, ఓటరు నమోదు కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతామని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి పోతుగంటి భరత్ ప్రసాద్, రాష్ట్ర అధికార ప్రతినిధి వన్నాల శ్రీరాములు, మాజీ జిల్లా అధ్యక్షులు వెన్నంపల్లి పాపన్న, కన్నం యుగదీశ్వర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లింగంపల్లి ప్రసాద్ రావు, ఎరుకల గణపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి దొంగల రాజేందర్, వివిధ మోర్చాల అధ్యక్షులు, మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వెంగళాపూర్‌లో వీధి దీపాల ఏర్పాటు

**ప్రజాపక్షం/తాడ్వాయి:** బతుకమ్మ పండుగ సందర్భంగా వెంగళాపూర్ గ్రామపంచాయతీలో నూతన వీధి దీపాల ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర మంత్రి సీతక్క ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గడ్డం నాగభూషణం ప్రత్యేక చొరవతో స్తంభాలకు విద్యుత్ బల్బులు ఏర్పాటు చేశారు. పండుగ వేళ ప్రజలకు రాత్రిపూట ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వీధులన్ని వెలుగులతో ఉండేలా చూస్తున్నామని, గ్రామ అభివృద్ధి, ప్రజా సౌకర్యాలకే తమ మొదటి ప్రాధాన్యత అని సర్పంచ్ తెలిపారు.

## దసరా వేడుకలపై పోలీసుల నిఘా





**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** దసరా పండుగ వేళ మండల వ్యాప్తంగా ప్రజలు ఉత్సాహంగా వేడుకలకు సిద్ధమవుతుండగా శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు పండుగను ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో ఆనందంగా జరుపుకోవాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకూడదని పోలీసు పెట్రోలింగ్ నిర్వహిస్తూ గ్రామాల్లో నిరంతరం నిఘా కొనసాగిస్తామని స్పష్టం చేశారు గ్రామాల్లో నిరంతర నిఘా దసరా పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు మండలంలోని వివిధ గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండనున్నారు అనుమానాస్పద వ్యక్తులు వాహనాల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు ఎక్కడైనా అనుమానాస్పద పరిస్థితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు అల్లర్లకు పాల్పడితే చర్యలు పండుగ పేరుతో గొడవలు సృష్టించడం అల్లర్లకు పాల్పడడం శాంతి భద్రతలకు విఘూతం కలిగించే చర్యలకు దిగడం వంటి వాటిని సహించేది లేదని పోలీసులు హెచ్చరించారు ప్రజలంతా పరస్పర సహకారంతో పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరించకుండా బాధ్యతాయుతాంగా మెలగాలని కోరారు రోడ్డు భద్రతపై అప్రమత్తత అవసరం పండుగ సమయంలో రహదారులపై రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ప్రజల భద్రత లక్ష్యం గా పండుగ సమయంలో ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటారని అధికారులు స్పష్టం చేశారు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు ప్రజలు పోలీసులకు సహకరిస్తూ మండల వ్యాప్తంగా దసరా వేడుకలను సంతోషంగా ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.

## సాధిక్ పాషా కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం



**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** అనారోగ్యంతోమృతి చెందిన గ్రామీణ తపాల ఉద్యోగి సాధిక్ పాషా కుటుంబానికి హనుమకొండ జీడీఎస్ కో ఆపరేటవ్ సొసైటీ తరపున రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు ఉద్యోగి కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ సహాయాన్ని అందించినట్లు సొసైటీ అధ్యక్షుడు అఖిల భారత గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు బొద్దున వెంకటేశ్వర్లు తెలిపారు హనుమకొండ పోస్టల్ డివిజన్ పరిధిలోని పసర సబ్ పోస్టాఫిస్‌లో గ్రామీణ తపాలా ఉద్యోగిగా పని చేస్తున్న సాధిక్ పాషా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు దీంతో ఆయన కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితిని గుర్తించిన హనుమకొండ జీడీఎస్ కో ఆపరేటివ్ సొసైటి సభ్యులు కుటుంబానికి సహాయం అందించాలని నిర్ణయించారు ఈ మేరకు శుక్రవారం పసర సబ్ పోస్టాఫిస్‌లో పోస్టల్ సిబ్బంది సమక్షంలో సాధిక్ పాషా భార్య కైరున్నిసా బేగం కు రూ.50 వేల చెక్కును బొద్దున వెంకటేశ్వర్లు అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాలా ఉద్యోగులది వసుదైక కుటుంబమని ఒక ఉద్యోగి కుటుంబానికి కష్టకాలం ఎదురైనపుడు తోటి ఉద్యోగులు అండగా నిలవడం తమ బాధ్యతని పేర్కొన్నారు డివిజన్‌లోని ప్రతి ఒక్కరూ కోసపరేటీవ్ సొసైటీలో సభ్యత్వం తీసుకోవాలని సూచించారుఈ కార్యక్రమంలో డివిజన్ సెక్రటరీ పెరుమాండ్ల తిరుపతి పసర సబ్ పోస్టుమాస్టర్ బి రమేష్ పోస్ట్‌మాన్ సయ్యద్ వహిద్ బి పి యం లు సందీప్ రెడ్డి అజీజ్ పాష వెంకన్న రాజ్ కుమార్ అశోక్ శ్రీలత విజయశ్రీ సాంబయ్య రాహుల్ మహేష్ తరుణ్ స్వరుణ్ ప్రణతి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ



**ప్రజాపక్షం/గణపురం:** జగిత్యాల వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ కోడూరి నవీన్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకొని గణపురం ఉన్న పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన సామాగ్రిని కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు. గణపురం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, ఇతర అవసరమైన వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలను ఆత్మ విశ్వాసంతో ఎదుర్కొని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల చదువుకు ప్రోత్సాహం అందించడం, వారి భవిష్యత్తుకు తోడ్పడటం అభినందనీయని పేర్కొన్నారు. డాక్టర్ నవీన్ కుమార్ జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాల ద్వారా నిర్వహించడం స్పూర్తిదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు భరత్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు దూలం కుమారస్వామి గౌడ్, సీనియర్ జర్నలిస్టు తాళ్లపల్లి యాదగిరి గౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బిజెపిలోకి యువత భారీ చేరికలు!



**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** మండలంలో భారతీయ జనతా పార్టీ లోకి యువత భారీ సంఖ్యలో చేరారు మేడారం సమ్మక్క సారలమ్మ తల్లుల సన్నిధిలో నిర్వహించిన కార్యక్రమంలో యువకులు బీజేపీ కండువాలు కప్పుకొని పార్టీలో చేరారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు దేశ ప్రగతి పట్ల ఆకర్షితులై బీజేపీలో చేరినట్లు నిర్వాహకులు తెలిపారు దేశాభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలనే సంకల్పంతో పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు యువతలో పెరుగుతున్న రాజకీయ చేతన్యం దేశసేవ పట్ల ఆసక్తి బీజేపీ బలోపేతానికి దోహదపడుతుందని పార్టీ నాయకులు ఆశాబావం వ్యక్తం చేశారు యువతను ప్రోత్సహించిన నాయకులు యువకులు బీజేపీలో చేరందుకు పర్రెం రఘుపతి రెడ్డి బండి వేణు అజిమిరా జీవహార్ లాల్ ఇర్సవడ్ల వినయ్ కీలకంగా వ్యవహరించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయియువతను పార్టీ సిద్దాంతాలు లక్ష్యాల వైపు నడిపించడంలో వారు ప్రోత్సాహం అందించారు ములుగు జిల్లా బీజేపీ అధ్యక్షుడు సిరికొండ బలరాం నాయకత్వంలో జిల్లా జనరల్ సెక్రటరీ జాడి వెంకట్ అధ్యక్షతన గోవిందరావుపేట మండల బీజేపీ మండల అధ్యక్షుడు మార్క సతీష్ ఆధ్వర్యంలో ఈ చేరికలు కార్యక్రమం నిర్వహించారు.

## పాము కాటుకు గురైన బాలుడికి మెరుగైన వైద్యం అందించాలి



**ప్రజాపక్షం/ములుగు:** ములుగు ప్రభుత్వ ఆసుపత్రిలో పాము కాటుకు గురై చికిత్స పొందుతున్న వెంకటాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్ కుమారుడిని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ శనివారం పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి బాలుడికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. మంత్రి సీతక్క ఆదేశాలు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనలు మేరకు బాలుడిని పరామర్శించినట్లు తెలిపారు. అనంతరం వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవీపేటకు చెందిన వార్డు సభ్యురాలు మూడ్ లీలా భర్త గన్యా నాయక్ అనారోగ్యంతో చికిత్స పొందుతుండగా ఆయనను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిడిశెట్టి కోటి, లక్ష్మీదేవిపేట సర్పంచ్ బొమ్మకంటి వంశావతి రమేష్, ఎల్లారెడ్డిపల్లి సర్పంచ్ బాషబోయిన పోషాలు, తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: ఎస్ఐ చంద్రశేఖర్

**ప్రజాపక్షం/ములుగు:** జిల్లా ఎస్పి సుధీర్ రామ్నాథ్ కేకన్ ఆదేశాల మేరకు మల్లంపల్లి మండలం శ్రీనగర్ క్రాస్ వద్ద జాతీయ రహదారిపై పోలీసులు ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఇసుక లారీలను ఆపి వేగ పరిమితులు, డ్రైవర్ల ప్రవర్తనను పరిశీలించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని గుర్తించేందుకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఇసుక లారీల అతివేగం, డ్రైవర్ల నిర్లక్ష్యంతో రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని ఎస్ఐ తెలిపారు. వేగ పరిమితులు దాటిన వాహనాలపై కేసులు నమోదు చేస్తామని, నిబంధనలు ఉల్లంఘిస్తే లారీలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రతి లారీకి స్పీడ్ లాక్ తప్పనిసరిగా ఉండాలని, డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. ప్రజల భద్రత దృష్ట్యా ప్రతి రోజూ తనిఖీలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## ఘనంగా బతుకమ్మ సంబరాలు

**ప్రజాపక్షం/ములుగు:** ములుగు జిల్లాలోని గ్రామాల్లో శనివారం సాయంత్రం బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. మహిళలు వివిధ రకాల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, వాటిని ఎత్తుకొని సమీపంలోని ఆలయాల వద్దకు చేరుకున్నారు. అక్కడ సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు. ఏటా ఆనందోత్సాహాల మధ్య నిర్వహించే బతుకమ్మ పండగతో గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. ప్రతి ఇంటి నుండి మహిళలు బతుకమ్మలను తీసుకువచ్చి సామూహికంగా వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ పండగలో విద్యార్థినులు సైతం ఉత్సాహంగా పాల్గొన్నారు. బతుకమ్మ పండగ సందర్భంగా పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు కుటుంబ సభ్యులతో కలిసి సంబరాలు చేసుకున్నారు.

## తాగునీటి కష్టాలకు చెక్

**ప్రజాపక్షం/గణపురం:** గ్రామీణ ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని గణపురం మండలంలోని తిమ్మాపురం గ్రామంలో తాగునీటి సమస్యకు పరిష్కారం లభించిందని బుద్దారం సర్పంచ్ విడిదినేని శ్రీలత అశోక్ అన్నారు. గ్రామంలో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో ఆమె ప్రత్యేక చొరవ తీసుకొని నూతన బోరు మోటారును బిగించి నీటి సరఫరాను పునరుద్దరించారు. తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడకుండా సమస్యను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టామని ఆమె తెలిపారు. నూతన మోటారు బిగింపుతో గ్రామంలో తిరిగి తాగునీటి సరఫరా అందుబాటులోకి రావడంతో గ్రామస్తులకు ఊరట లభించింది. ప్రజల అవసరాలను గుర్తించి, స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగడం అభినందనీయమని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మారేపల్లి ఐలయ్యతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఆసుపత్రిలో చెత్త వేరు చేయకపోవడంపై మున్సిపల్ కమిషనర్ ఆగ్రహం...



ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్: సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చెత్త పేరుకుపోవడంపై మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని మెడికల్ కళాశాల ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి ప్రతిరోజూ వందలాది మంది రోగులు, వారి కుటుంబ సభ్యులు, ప్రజలు వస్తుంటారని, అలాంటి ప్రదేశంలో చెత్తను సక్రమంగా వేరు చేయకుండా నిల్వ చేయడం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారడమే కాకుండా, వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఆసుపత్రిలో ఉత్పత్తి అయ్యే చెత్తను తడి, పొడి, హానికరమైన చెత్తగా మూడు రకాలుగా వేరు చేయడం తప్పనిసరని స్పష్టం చేశారు. వేరు చేసిన చెత్తను సంబంధిత మున్సిపల్ వాహనాలకు అందించాలని, ఆసుపత్రి పరిసరాల్లో ఎక్కడా చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజారోగ్యానికి సంబంధించిన విషయంలో నిర్లక్ష్యం సహించేది లేదని,చెత్త నిర్వహణలో ఇలాంటి పరిస్థితులు మళ్లీ పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆసుపత్రి పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచడంతో పాటు,చెత్త సేకరణ,వేరు చేయడం,తరలింపు ప్రక్రియలను పర్యవేక్షించాలని శానిటరి అధికారులకు సూచించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో చెత్త పేరుకుపోవడానికి సంబంధించిన సమస్యపై మెడికల్ కాలేజ్ సూపరింటెండెంట్ డాక్టర్ సంగీత,జిల్లా వైద్యాధికారి డాక్టర్ ధనరాజ్, ఆర్ఎంఓ డాక్టర్ శ్రావణితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని,సంబంధిత విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఇకపై ఇటువంటి సమస్యలు పునరావృతం కాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని,ఆసుపత్రికి వచ్చే రోగులు,ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మహేష్,శివకుమార్,అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ సంబరాలు



ప్రజాపక్షం/ కొమురవెల్లి : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు కొమురవెల్లిలో ఘనంగా నిర్వహించారు. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో ఆటపాటలతో సందడి చేశారు. బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.

## జంతర్ మంతర్ నిరసనపై ఢిల్లీ పోలీసుల ఆంక్షలు అప్రజాస్వామికం...



ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్: ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ, భారత ఎన్నికల సంఘం పనితీరును నిరసిస్తూ నేడు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించ తలపెట్టిన ప్రజాస్వామ్య నిరసనను అడ్డుకునేందుకు ఢిల్లీ పోలీసులు విధించిన అసాధారణ ఆంక్షలను అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్ ) సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు జనగాం రాజ్ కుమార్ తీవ్రంగా ఖండించారు. శనివారం ఆయన ఒక ప్రకటనలో మీడియాతో మాట్లాడుతూ కేంద్ర హోంమంత్రి ఆదేశాల మేరకే ఈ ఆంక్షలు విధించారనే ఆరోపణలపై ఆయన ఆందోళన వ్యక్తం చేస్తూ, నిరసన కార్యక్రమానికి అనుమతి నిరాకరించడం, భారీగా బారికేడ్లు ఏర్పాటు చేయడం, నిషేధాజ్ఞలు విధించడం, 57 మెట్రో స్టేషన్లను మూసివేయడం, ఢిల్లీకి వెళ్లే రైళ్లను రద్దు చేయడం, దేశంలోని పలు ప్రాంతాల్లో నిరసనకారులను గృహనిర్బంధంలో ఉంచడం, దేశ రాజధాని ప్రాంతమంతటా భారీగా భద్రతా బలగాలను మోహరించడం వంటివి ప్రజల రాజ్యాంగబద్ధమైన, ప్రాథమిక హక్కులపై దాడి చేయడమేనని ఆయన పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల్లో విద్యార్థి కార్యకర్తలను నిర్బంధిస్తున్నట్లు, విద్యార్థి సంఘాల కార్యాలయాలపై నిఘా ఉంచినట్లు వస్తున్న వార్తలపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీ నిరసనలో పాల్గొనేందుకు విమానంలో ప్రయాణిస్తున్న ఎఐవైఎఫ్,ఎఐఎస్ఎఫ్,సిజెపి నాయకులను అరెస్టు చేయడానికి పోలీసులు విమానం లోపలికి వెళ్లినట్లు వచ్చిన సమాచారం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. విమానంలోకి ప్రవేశించి కార్యకర్తలను అరెస్టు చేయడానికి ప్రయత్నించడం చట్టవిరుద్ధమైన చర్యగా ఆయన ఖండించారు. ప్రజాస్వామ్య ఉద్యమాల్లో పాల్గొనే వారిని భయభ్రాంతులకు గురిచేసి, శాంతియుత నిరసనలను అణచివేయాలనే ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన ప్రభుత్వాలు ప్రజల గొంతుకలను అణచివేయడం సరికాదని,రాజ్యాంగం కల్పించిన హక్కులను కేంద్ర ప్రభుత్వం గౌరవించాలన్నారు. ఎన్నికల ప్రక్రియ, ఎన్నికల సంఘం పనితీరుపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేసేందుకు ప్రజలకు స్వేచ్ఛ కల్పించాలన్నారు. జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును ఎవరూ హరించలేరని స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ గ్రామ శాఖ కమిటీ నియామకం



ప్రజాపక్షం/చేర్యాల : చేర్యాల మండలం ఆకునూర్ గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ కమిటీ నియామకం మండల అధ్యక్షుడు మంజ మల్లేశం ఆధ్వర్యంలో శనివారం జరిగింది. గ్రామశాఖ అధ్యక్షుడిగా ఆకుల రాజు వరుసగా రెండోసారి ఎన్నికైయ్యారు. నూతన కమిటీలో ఉపాధ్యక్షుడిగా పెద్ద ముత్తని పోశయ్య, యూత్ అధ్యక్షుడిగా ఉడుత బాలరాజు, యూత్ ఉపాధ్యక్షుడిగా పొదాల శివకృష్ణ నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో మండల జనరల్ సెక్రటరీ కొలిపాక వెంకటయ్య, సెక్రటరీ సయ్యద్ అజారుద్దీన్, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## మార్కెట్ యార్డు అభివృద్ధికి సంపూర్ణ సహకారం



ప్రజాపక్షం/గజ్వేల్ : జంట నగరాలకు సమీపంలోని వంటిమామిడి కూరగాయల మార్కెట్ అభివృద్ధికి తన వంతు సంపూర్ణ సహకారం ఉంటుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. శనివారం మార్కెట్ యార్డులో సిసి రోడ్డుకు చైర్మన్ విజయ మోహన్, వైస్ చైర్మన్ ప్రభాకర్ గుప్త లతో కలిసి శంకుస్థాపన చేయడంతో పాటు సిబ్బందికి దసరా బట్టలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వంటిమామిడి మార్కెట్ యార్డులో నెలకొన్న సమస్యలను ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తేగా, త్వరలోనే విస్తరణ పనులు చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. అయితే పాలకమండలి రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూడడంతో పాటు రోడ్లపై ప్రయాణికులకు జరుగుతున్న ఇబ్బందులపై దృష్టి పెట్టాలని సూచించారు. అన్నదాతలకు మెరుగైన సేవలు అందించి సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చి పెట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ జాన్ వెస్లీ, మాజీ చైర్మన్ సయ్యద్ సలీం, సర్పంచ్ కోన్యాల బాల్ రెడ్డి, కాంగ్రెస్ అభియాన్ జిల్లా చైర్మన్ నర్సింహా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎంగిలి పూల బతుకమ్మ

ప్రజాపక్షం /నిజాంపేట్ : నిజాంపేట మండలంలోని నస్కల్ గ్రామంలో శివుని గుడి ఆవరణలో ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను గ్రామంలోని మహిళలు ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. ఉదయం నుండే మహిళలు రంగురంగుల పూలను సేకరించి, అందంగా బతుకమ్మలను పేర్చారు. సాయంత్రం కాగానే గ్రామంలోని శివుని గుడి దేవాలయం లో మహిళలు, యువతులు, చిన్నారులు పెద్ద ఎత్తున చేరి బతుకమ్మల చుట్టూ తిరుగుతూ సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేశారు. తొమ్మిది రోజుల బతుకమ్మల వేడుకలను వివిధ రకాల పేర్లతో జరుపుకుంటారు.

## రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ధూల్మిట్ట విద్యార్థినులు



ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట : నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లిలో ఈ నెల 11 మరియు 12వ తేదీల్లో నిర్వహించనున్న 11వ (అండర్ జిల్లా ) రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ధూల్మిట్ట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి 6 మంది విద్యార్థినులు ఎంపికయ్యారు. సిద్దిపేట జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా సాఫ్ట్‌బాల్ సెలెక్షన్లలో కొండూరి అమూల్య, చెవిటి రస్మిత, శిరబోయిన తేజశ్రీ, ఎంటె భవ్యశ్రీ, తాండం శ్రీవర్ష, శిరబోయిన వర్షిక, (అర్హత సాధించినట్లు) ఎంపికయ్యారని ధూల్మిట్ట మండల విద్యాశాఖ అధికారి మరియు ధూల్మిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనుముల కర్ణాకర్‌రెడ్డి, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వెగ్గలం సతీష్‌కుమార్‌లు తెలిపారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి రేణుక మాట్లాడుతూ, ధూల్మిట్ట పాఠశాలలో ప్రతిభగల విద్యార్థిని, విద్యార్థులు ఉన్నారని, వారికి సరైన వసతులు కల్పించి మరింత ప్రోత్సాహం అందిస్తే భవిష్యత్తులో క్రీడల్లో మరింత రాణిస్తారని రేణుక అన్నారు. రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన 6 మంది విద్యార్థినులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనుముల కర్ణాకర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ గునుకుల లీలా జగన్ మోహన్ రెడ్డి, సిద్దిపేట జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి కైలాసం గుప్త, కార్యదర్శి రేణుక, ఆటల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభను కనబరుస్తున్నా పాఠశాల విద్యార్థులను, ప్రోత్సహించి ఉత్తమమైన శిక్షణలతో ముందకు తీసుకపోతున్న ఫిజికల్ డైరెక్టర్ వెగ్గలం సతీష్ కుమార్, ఉపాధ్యాయ బృందం, గ్రామస్థులు, ప్రజాపక్షం పత్రిక విలేకరి కొండూరి సతీష్ కుమార్, శిక్షకులు నవీన్‌తో పాటుగా పాఠశాల విద్యార్థి తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

## పురుగుల మందు తాగలేదా...? ఇంకా బతికే ఉన్నావా...?

ప్రజాపక్షం/గజ్వేల్ : భూ సంబంధిత సమస్యతో ఓ రైతు తగు న్యాయం కోసం గజ్వేల్ ఎమ్మార్వోను కలుసుకోగా, నువ్వు బ్రతికే ఉన్నావా, పురుగుల మందు తాగలేదా...? అంటూ ఆయన వెటకారంగా చేసిన వ్యాఖ్యల వీడియో వైరల్ కావడం ఆగ్రహానికి గురిచేస్తోంది. మండలంలోని ముక్తమాసన్ పల్లికి చెందిన రైతు యేసు తన భూ సమస్యను పరిష్కరించాలని స్థానిక తహసీల్దార్ ను ఆశ్రయించాడు. అయితే ఆయన రైతు చావును కోరడంతో ఆవేదన చెందిన యేసు మీరు నవ్వడం ఏమిటని ప్రశ్నించారు. దీంతో మరింత వ్యంగ్యంగా మాట్లాడుతూ ఎమ్మార్వో బదులిచ్చాడు. ఈ వీడియో వైరల్ కావడంతో ఆయన తీరును నిరసిస్తూ సోషల్ మీడియాలో పలువురు ఆగ్రహం వ్యక్తం చేయగా, స్థానిక బిజెపి నేతలు ఎంపీ రఘునందన్ రావు దృష్టికి ఈ వ్యవహారం తీసుకెళ్లినట్లు తెలుస్తోంది.

## వర్గల్ కస్తూర్బాలో... తాగునీటి సమస్యకు పరిష్కారం



ప్రజాపక్షం/గజ్వేల్ : వర్గల్ లోని కస్తూర్బా గాంధీ బాలికల ఉన్నత పాఠశాలలో తాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చగా, పాఠశాల ప్రిన్సిపాల్ వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ విజయమోహన్ దృష్టికి తీసుకెళ్లింది. ఈ క్రమంలో వారు సమస్య తీవ్రతను మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డికి విన్నవించారు. దీంతో ఆయన ప్రత్యేక చొరవ తీసుకొని శనివారం బోరు బండిని రప్పించి విద్యాలయ ఆవరణలో బోరు వేయించారు. దీంతో గత కొంతకాలంగా నెలకొన్న త్రాగునీటి సమస్యకు పరిష్కారం లభించగా, విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం వారికి కృతజ్ఞతలు తెలిపింది. కాగా మొదటగా మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి విద్యార్థినులతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు, పాఠశాల పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్, వైస్ చైర్మన్ ప్రభాకర్ గుప్త, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పొన్నాల నర్సారెడ్డి, ఉప సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, వర్గల్ మాజీ సర్పంచ్ తుంకుంట గోపాల్ రెడ్డి, వర్గల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్, మాజీ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, వార్డు సభ్యులు అమ్మగారి తేజస్వి అరవింద్ రెడ్డి, తుంకుంట శ్రీనివాస్ రెడ్డి, అయ్యగల్ల బన్నీ రాజ్, గంగారం పరశురాములు, మాజీ కోఆప్షన్ వహీద్ తదితరులు పాల్గొన్నారు.

## మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ



ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట : దేశంలోనే పూలను పూజించి, ప్రకృతిని ప్రేమించే గొప్ప పండుగ బతుకమ్మ పండుగ. మహిళలను గౌరవిస్తూ వారి ఔనత్యాన్ని చాటి చెప్పే సంస్కృతికి వెదిక మన తెలంగాణలో బతుకమ్మ పండుగ అని ధూల్మిట్ట గరామ సర్పంచ్ గునుకుల లీలా జగన్‌మోహన్ రెడ్డి మాజీ జడ్పీటీసీ నాచగోని పద్మా వెంకట్ గౌడ్‌లు పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా ఉమ్మడి మద్దూరు, ధూల్మిట్ట మండలాల వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లో బతుకమ్మ పండుగ సంబరాల అంబరాన్ని అంటాయి. పూలతో పేర్చిన బతుకమ్మలతో ఆట పాటలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రోజురోజుకు సమాజంలో సాంప్రదాయ బద్ధంగా చేసుకునే పండుగల్లో పాశ్చాత్య సంస్కృతి జొప్పిస్తూ సాగుతున్న ఆట పాటలకు దూరంగా తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ పండుగ నిలుస్తుందన్నారు. మన సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. మహాలయ అమావాస్యనుండి తొమ్మిది రోజుల అత్యంత భక్తి శ్రద్ధలతో బతుకమ్మను పండుగను జరుపుకుంటారన్నారు. తెలంగాణ ఆడబిడ్డల ఆంబరాన్ని అంటే సంబరం బతుకమ్మ పండుగ అని కొనియాడారు. తంగేడు, గునుగు, పట్టుకుచ్చుల, చామంతి, బంతిపూలతో పాటుగా తీరొక్క పూలతో బతకమ్మను పేర్చి పూల బతకమ్మను దేవుడిలా కొలుస్తు ఆరాధిస్తారన్నారు.

## వరకట్న వేదింపుల కేసులో ముగ్గురు నిందితులకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** జహీరాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిదిలో నమోదైన వరకట్న మరణం కేసులో సంగారెడ్డి లోని ప్యామిలీ కోర్టు కమ్ IV అదనపు జిల్లా ,సెషన్స్ న్యాయస్థానం ముగ్గురు నిందితులకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విదించింది. ఈ కేసులో నిందితులకు శిక్షపడేలా సమర్థవంతంగా కృషి చేసిన పోలీసు అధికారులు,కోర్డు డ్యూటీ సిబ్బందిని జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ అబినందించారు. కేసు వివరాలోనికి వెళ్తి జహీరాబాద్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఎన్‌జీఓఎస్ కాలనీలో 15/02/2022 న జరిగిన వరకట్న మరణం క్రైమ్ నెం 47/2022 సెక్షన్ 304 (బి) r w 34 ఐపిసి కేసులో పసుల నికిత (19)కు 16/05/2021 పసుల సాయికుమార్‌తో వివాహం జరిగింది. వివాహమైన రెండు నెలల తర్వాత అదనంగా కట్నం తీసుకురావాలని భర్త పసుల సాయికుమార్, అత్త అనసూయ, మామ యాదప్ప లు నికితను మానసికంగా ,శారీరకంగా వేధించినట్లు పిర్యాదులో పేర్కొన్నారు. వేధింపులు తట్టుకోలేక నికిత 15/02/2022 రాత్రి జహిరాబాద్‌లోని ఎన్‌జిఓస్ కాలనీలో తాను నివస్తున్న అద్దె ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందింది. ఈ ఘటనపై మృతిరాలి తల్లి బోడ్డుగారి మంజుల పిర్యాదు మేరకు 16/02/2022 న జహిరాబాద్ టౌన్ పోలీసులు పిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన ఎస్ఐ కె .శ్రీకాంత్ దర్యాప్తు అనంతరం నిందుతులకు న్యాయస్థానం లో ప్రవేశ పెట్టగా కేసు పూర్వపరాలు విన్న ప్యామీలీ కోర్టు కమ్ IV అదనపు జిల్లా ,సెషన్స్ జడ్జీ ఎం సతీష్‌రకుమార్ ముగ్గురికి ఏడేళ్ల కఠిన కార్యాగార శిక్ష విధించారు. ఈ కేసులో మొదటి దర్యాప్తు అధికారిగా వ్యవహరించిన ఎస్ఐ కె .శ్రీకాంత్ తదుపరి అధికారి ఎస్‌డిపిఓ జి.శంకర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్, బి. రాములు ,కోర్టు డ్యూటీ సిబ్బంది హెడ్ కానిస్టెబుల్ శివకుమార్, హెడ్ కానిస్టేబుల్ కె. వెంకటేశ్వర్ లైజనింగ్ అధికారులుగా పనిచేసిన ఎస్ఐలు కె. సత్యనారాయణ బిక్షపతిలను జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ అభినందించారు.

## ఆర్టీసి ఎన్నికల ఫలితాలు రాష్ట్ర ప్రభుత్వానికి గొడ్డలిపెట్టు

**ప్రజాపక్షం/నర్సంపేట:** ఆర్టీసి కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వ కూటమి ఓటమి పాలవడం రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టు అని బిఆర్‌టియూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు అన్నారు. ఈ ఫలితాలతో ప్రభుత్వంపై ఉద్యోగుల్లో ఉన్న వ్యతిరేకత స్పష్టమైందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి ఆర్టీసి కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రెండు పిఆర్సీలు పెండింగ్‌లో ఉన్నాయని, డిఏలు సైతం పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న డిఏ బకాయిలను అక్టోబర్ నెల వేతనంతో చెల్లించకుండా, పదవి విరమణ ప్రయోజనాల్లో కలిపి ఇస్తామని చెప్పడం ఉద్యోగులను మరోసారి మోసం చేయడమేనని ఆరోపించారు. ఉద్యోగులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎన్నికల్లోనూ ప్రభుత్వ వ్యతిరేకత ప్రతిఫలిస్తుందని, బిఆర్ఎస్ గ్రాడ్యుయేట్ అభ్యర్థి విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

## నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



**ప్రజాపక్షం/కొండపాక :** కోరిన కోరికలు తీర్చే తెలంగాణలోనే ప్రసిద్ధి పొందిన మర్పడగ విజయ దుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఈనెల 11 నుంచి 20 వరకు తొమ్మిది రోజులు జరగనున్నాయి. ఉత్సవాల కోసం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు దేవీ ఉపాసకులు డాక్టర్ చెప్పెల హరినాథ శర్మ తెలిపారు. ఉత్సవాలలో భాగంగా మొదటి రోజు శుక్రహోరంలో కలశస్థాపన,దీక్షాధారణ కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు.అనంతరం విజయదశమి ఉత్సవాలు నిర్వహిస్తారు. విజయ దశమి ఉత్సవాలలో భక్తులు పాల్గొని విజయ దుర్గ దేవి దర్శనం చేసుకోవాలని కోరారు.

# పూలనే దేవతలుగా కొలిచే పండగ..బతుకమ్మ!

**ప్రజాపక్షం/నెక్కొండ:** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు బతుకమ్మ పండగ అద్దం పడుతుంది. ప్రకృతిలో సహజంగా వికసించే రంగురంగుల పూలనే దేవతలుగా భావించి, పూజించే అరుదైన సంప్రదాయం తెలంగాణ ప్రత్యేకతను ప్రపంచానికి చాటి చెబుతోంది. తంగేడు, గునుగు, బంతి తదితర పూలతో బతుకమ్మను పేర్చి, చుట్టు చేరి ఆడపడుచులు ఆటపాటలతో సంబరాలు చేసుకోవడం ఈ పండగ విశిష్టత. బతుకమ్మ అంటే కేవలం పూలను పూర్చి ఆడుకేనే పండగ మాత్రమే కాదని, తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయతకు, కుటుంబ అనుబంధాలకు ప్రకృతి ప్రేమకు ప్రతీక. తరతరాలుగా వస్తున్న జానపద గేయాలు, స్థానిక యాస, భాష ఈ పండగకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. 'బతుకమ్మా బతుకమ్మా ఉయ్యాలో..బంగారు బతుకమ్మ ఉయ్యాలో' అంటూ సాగు పాటల్లో తెలంగాణ జీవనశైలి, ఆడపడుచుల ఆశలు, ఆకాంక్షలు ప్రతిధ్వనిస్తాయి. 'బతుకమ్మ..చల్లగా బతుకమ్మా' అంటూ దీవించే మాటల్లోనే ఈ పండగ వెనుక ఉన్న జీవన తాత్వికత కనిపిస్తుంది. ప్రకృతిలో లభించే పూలకు ప్రాధాన్యమిస్తూ, వాటిని పవిత్రంగా భావించి పూజించడం ఈ పండగలోని అంతరార్థం. పూల సౌందర్యంతో పాటు ప్రకృతిని గౌరవించాలనే సందేశాన్ని బతుకమ్మ అందిస్తుంది. చెరువులు, నీటి వనరులు, గ్రామీణ జీవనంతో ముడిపడిన ఈ వేడుక తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకగా నిలుస్తోంది. విదేశాల్లో నివసిస్తున్న తెలంగాణ ప్రజలు సైతం బతుకమ్మను నిర్వహిస్తూ తమ మూలాలను గుర్తు చేసుకుంటున్నారు. ఒకే రోజు..రెండు సంప్రదాయాల



సందడి ఇదే రోజు పితృ అమావాస్య సందర్భంగా మరో సంప్రదాయం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. గతించిన తమ పితృదేవతలను స్మరించుకుంటూ కుటుంబ సభ్యులు తర్పణాలు, పిండ ప్రధానాలు నిర్వహిస్తూ వారి ఆత్మలను శాంతపరిచే పూజలు చేస్తారు. సంప్రదాయం ప్రకారం బ్రహ్మణులకు బియ్యం, పప్పు, ఉప్పు , చల్ల చమురు తదితర వాస్తు సామాగ్రిని బ్రహ్మణులకు దానం ఇస్తారు. పితృదేవతలను స్మరించకుంటారు. కుటుంబ మూలాలను గుర్తు చేసుకోవడం ఈ ఆచారంలో ప్రధాన భావన. ఉమ్మడి ఈ సంప్రదాయ దానంలో కొనసాగుతున్నాయి. బతుకమ్మ పాటలతో పల్లెలు సందడిగా మారుతుండగా మరోవైపు పితృదేవతలను స్మరించుకుని ఆచారాలతో ఆధ్యాత్మిక వాతావరణంలో ఇంటిలో కనిపిస్తుంది.

# ఎన్నికల ప్రధానకమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి

**ప్రజాపక్షం/ వరంగల్ :** కేంద్ర చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని, సర్ ప్రక్రియను నిలిపివేసి అర్హులైన తొలగించిన కోట్లాది మంది ఓటర్లను తిరిగి జాబితాలో చేర్చాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. వరంగల్ లో బిసి హక్కుల సాధన సమితి సమావేశంలో మాట్లాడుతూ సర్ ప్రక్రియ పేరుతో అర్హులైన కోట్లాదిమంది ఓటర్లను ఏకపక్షంగా తొలగించడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. తొలగించిన ఓట్లను వెంటనే పునరుద్ధరించి అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాస్వామికి హక్కులను రక్షించే విధంగా ఎలక్షన్ కమిషన్ వ్యవహరించకుండ అర్హులైన ఓటును తొలగించే పనికి బరితెగించడం అత్యంత దుర్మార్గమన్నారు. అశేష త్యాగాలతో సాధించుకున్న స్వాతంత్ర భారతావనిలో ప్రజాస్వామ్య అస్థిత్వం ఓటరేనని, ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడకు కీలకమైన ఓటు హక్కును తొలగించే అధికారం జ్ఞానేశ్ కుమార్ కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. కోట్లాదిమంది అర్హత కలిగిన ఓటర్ల తొలగింపుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా బాధ్యత వహించాలన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, ఓటు హక్కును రక్షించండి, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి మొదలైన డిమాండ్స్‌తో



దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్న కేంద్ర ప్రభుత్వం స్పందించక పోవడం దుర్మార్గమన్నారు. ఎస్ఐఆర్ పేరుతో 13 కోట్ల ఓట్లను రద్దు చేయడాన్ని నిరసిస్తూ కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈరోజు ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ప్రతిపక్ష పార్టీలు, ప్రజాస్వామ్య వాదులు శాంతియుతంగా ఆందోళన కార్యక్రమాలకు పూనుకుంటే పోలీసులతో వివిధ ప్రాంతాలలో అరెస్టులు చేయించడం రైళ్ళను, మెట్రోలను నిలిపివేయడం,అణచివేతలకు పూనుకోవడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనన్నారు. లాఠీలతో తూటాలతో ప్రజా ఉద్యమాలను అణచలేరని ఇప్పటికైనా పాలకులు గ్రహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ప్రధాన ఎన్నికల కమిషనర్ ను తొలగించి ఆయనపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. లేనిచో ప్రజా ఉద్యమాలు ఉధృతమైతే అందుకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని వెంకట్రాములు హెచ్చరించారు.ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి, ఆరేల్లి ప్రభాకర్, బోట్ల శ్రీనివాస్, పుల్లూరి కుమారస్వామి, ఓదెలు, చందు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా), హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన ఆర్యవైశ్య విద్యార్థిని విద్యార్థులకు అక్టోబర్ 25వ తేదీ ఆదివారం ఉదయం 10:30 గంటలకి ఆవోపా భవనంలో బంగారు పతకాలను అందజేయడం జరుగుతుందని అవోపా జిల్లా అధ్యక్షులు దొంతుల ఈశ్వరయ్య శనివారం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో తెలిపారు. 2025 26 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు 10వ తరగతి నుండి పీజీ, పీహెచ్డీ వరకు ఉన్న అన్ని కోర్సులకు, 202627 విద్యా సంవత్సరానికి గాను అన్ని ఎంట్రన్స్ పరీక్షలలో ఉత్తమ ర్యాంకులు సాధించిన వారు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థిని విద్యార్థులు హనుమకొండ సుబేదారి లోని అవోపా కార్యాలయంలో దరఖాస్తు పత్రాలను సమర్పించవలనని తెలిపారు. ఒక్కొక్క కోర్సులలో తమకు అందిన దరఖాస్తులలో అత్యధిక మార్కులు సాధించిన ప్రతిభావంతులైన ఆర్యవైశ్య విద్యార్థులకు బంగారు పతకాలు ప్రధానం చేయడం జరుగుతుందని, మొత్తం 61 బంగారు పతకాలను ప్రధానం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 19లోపు దరఖాస్తుతో పాటు విద్యార్థి మార్కుల జాబితా/ర్యాంక్ కార్డు, ఫోటో, ఆధార్ కార్డు జతచేసి అందజేయవలనని మరిన్ని వివరాల కొరకు 7093035699, 9989913365 నెంబర్ ను సంప్రదించగలరని తెలిపారు. ఈ సమావేశంలో భాస్కర రావు, కోశాధికారి డాక్టర్ గంపా సతీష్, వర్కింగ్ ప్రెసిడెంట్ గన్ను సురేందర్,జాయింట్ సెక్రటరీ లక్ష్మణ కాంత్, పీఆర్ఓ పబ్బతి నాగభూషణం, విద్యా కమిటీ సభ్యులు డాక్టర్ గన్ను నటరాజశేఖర్, డాక్టర్ పుల్లూరు శ్రీనివాస్, రవ్వ రమేష్, కొనిశెట్టి సత్యనారాయణ, డాక్టర్ గంపా రజిత పాల్గొన్నారు.



## బాబాయ్..అబ్బాయి భేటీ.. రాజకీయ మంతనాలేనా!

### మంత్రి పదవి నుండి వరుస విజయాల వరకు..ఆలోచనల్లో మునిగిన నేతలు!

**ప్రజాపక్షం/నెక్కొండ:** బాబాయ్..అబ్బాయి కలిసి కూర్చుంటే కుటుంబ కబుర్లే అనుకుంటే పొరపాటే..రాజకీయ భవిష్యత్తుపై లెక్కలు కూడా ఉంటాయేమో! నర్సంపేట ఎంఎల్స్త్ర దొంతి మాధవరెడ్డి తనయుడు, దొంతి అయుక్తు రెడ్డి దొంతి మాధవరెడ్డి కజిన్ సోదరుడు అజయ్‌కుమార్ కలిసి ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్న దృశ్యం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మాధవరెడ్డికి మంత్రి పదవి రావాలంటే పార్టీ కోసం ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలి? నియోజకవర్గ అభివృద్ధితో ప్రజల మనసులు ఎలా గెలుచుకోవాలి? మరో ఇరవై ఏళ్ల పాటు విజయపరంపర కొనసాగించాలంటే ఇప్పటి నుండే ఎలాంటి వ్యూహాలు రచించాలి? అన్న అంశాలపై మంతనాలు సాగుతున్నాయేమోనని రాజకీయ చమత్కారాలు వినిపిస్తున్నాయి. అయితే, వారి ఆలోచనలు ఏమిటో వారికే తెలియాలి...కానీ ఫోటో మాత్రం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు మంచి ముడిసరుకు ఇచ్చింది. పదవులపై ఆశలు ఉండొచ్చు..కానీ ప్రజల మనసుల్లో స్థానం సంపాదించాలంటే అభివృద్ధి పనులే అసలైన రాజకీయ పెట్టుబడి!

